క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌జీవో సంఘం నాయకులు


కలెక్టర్‌కు పూలమొక్క ఇస్తున్న నాయకులు

కరీంనగర్: టీఎన్‌జీవోల సంఘం నాయకులు శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 20న జరిగే ఉద్యోగుల స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంతో పాటు టీఎన్జీవోల సంఘం జిల్లా డైరీ ఆవిష్కరణకు హాజరు కావాలని కోరారు. అదేవిధంగా అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో కె.మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పేయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కౌన్సిల్ సమావేశానికి ఆహ్వానించారు. టీఎన్‌జీవో నాయకులు దారం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్‌రావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, హర్మీందర్‌సింగ్, రాజేశ్, భరద్వాజ్, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్‌టీఏ మెంబర్ రాహుల్

కరీంనగర్ కార్పొరేషన్: ఇటీవల ఆర్‌టీఏ సభ్యుడిగా నియమితులైన పడాల రాహుల్ శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేశారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు, రవాణాశాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

ముగిసిన టెండర్ల గడువు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో సుడా నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ గడువు ముగిసింది. రూ.1.97 కోట్లతో 18 పనులకు సంబంధించి ఇటీవల టెండర్ పిలిచారు. బిడ్ దాఖలు గడువు శుక్రవారంతో ముగిసినందున శనివారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేయనున్నట్లు సమాచారం.

అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభ


కూల్‌డ్రింక్స్‌తో కలిగే అనర్థాలను వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్ పద్మ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించారు. ప్రత్యేక బోర్డుపై కూల్‌డ్రింక్స్‌తో కలిగే పలు అనర్థాలను అంగన్‌వాడీ టీచర్ పద్మ వివరించారు. ఒక్కో కూల్‌డ్రింక్‌లో ఉన్న షుగర్, ఆల్కహాల్ శాతంతో చిన్నారులు, మహిళలకు వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కూల్‌డ్రింక్స్‌కు బదులు పాలు, నీళ్లు, పండ్ల రసాలు తాగితే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో తల్లులతో పాటు చిన్నారులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జ్యోతిబసు


జ్యోతిబసు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: తుది శ్వాస విడిచే వరకు ప్రజల అభ్యున్నతి కోసం పనిచేసిన గొప్ప మానవతావాది, ఆదర్శప్రాయుడు మార్క్సిస్టు మేధావి జ్యోతిబసు అని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. జ్యోతిబసు వర్ధంతి సందర్భంగా శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక భూమిక మహించిన జ్యోతిబసు 1964లో సీపీఎం పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరన్నారు. కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా క్రమశిక్షణతోపార్టీలో ఎదిగారని తెలిపారు. 23 ఏళ్లకు పైగా పశ్చిబెంగాల్ సీఎంగా పనిచేసి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గిట్ల ముకుందరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సంపత్, నరేశ్, కోనేటి నాగరాణి, నాయకులు పుల్లెల మల్లయ్య, రాయికంటి శ్రీనివాస్, దేవేంద్ర, రోజారాణి, మానస తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



కరీంనగర్: గాయత్రి బ్యాంక్ కరీంనగర్‌శాఖ ఖాతాదారుడు ఆకుల కొండయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా.. గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాదబీమా సౌకర్యం ద్వారా మృతుడి కుమార్తె అనూషకు రూ.1 లక్ష చెక్కును మేయర్ సునీల్‌రావు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. బ్రాంచ్ మేనేజర్ గొట్టె అశోక్, జూనియర్ ఆఫీసర్ ఉల్లెంగల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



అంజనాద్రి గుట్టపై లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు


రామేశ్వరాలయంలో కుంకుమార్చనలు

కరీంనగర్ కల్చరల్: సంకటహర చతుర్థి పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటిల్లిపాది అర్చనలు, అభిషేకాలు చేశారు. భగత్‌నగర్‌లోని అంజనాద్రి లక్ష్మీగణపతి ఆలయంలో స్వామివారికి అభిషేక అర్చన జరిపారు. కమాన్ రోడ్ రామేశ్వరాలయంలో కుంకుమార్చనలు చేశారు. అశోక్‌నగర్‌లోని కన్యక పరమేశ్వర ఆలయం, గంజ్ వరసిద్ధి వినాయక ఆలయంలో సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు.

స్వయంభూ వినాయకుడికి పూజలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో స్వయంభూ వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక మండపంపై రంగురంగుల విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేసి విగ్రహాన్ని పూలతో అలంకరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతితో పాటు దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలకు చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.


గోపాల్‌పూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

మా దరఖాస్తులెక్కడ!

- ఇందిరమ్మ దరఖాస్తుదారుల ఆవేదన
- సర్వే జాబితాలో కనిపించని పేర్లు
- ప్రతీ డివిజన్‌లోనూ బాధితులు

'నగరంలోని 22వ డివిజన్ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన కదారి స్వరూప ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఎన్నికల హామీ మేరకు ఆరుగ్యారంటీలకు సంబంధించి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించడం తెలిసిందే. 2023 డిసెంబర్ 29వ తేదీన స్వరూప ప్రజాపాలన దరఖాస్తు (కేఎస్ఆర్/22/టీ1/151) అందచేశారు. ఆమెకు గ్యాస్ సబ్సిడీ కూడా వస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించిన సర్వే జాబితాలో మాత్రం ఆమె పేరు లేదు. తాను ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నానని, జాబితాలో తన పేరు ఎందుకు రాలేదని అధికారుల చుట్టూ తిరిగినా, చివరకు కలెక్టర్‌ను కలిసినా ఫలితం కనిపించడం లేదని వాపోయింది.'

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి కావస్తోంది. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా డివిజన్ల వారీగా రూపొందించిన జాబితా ప్రామాణికంగా ఉద్యోగులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. ఆ జాబితాలో వందలాది మంది దరఖాస్తుదారుల పేర్లు లేకపోవడం వివాదాస్పదమవుతోంది. ప్రజాపాలన దరఖాస్తుల్లో తాము ఇందిరమ్మ ఇండ్లు కావాలని మార్క్ చేసినప్పటికి, జాబితాలో తమ పేర్లు లేకపోవడమేమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. దరఖాస్తుదారుల జాబితాలో పేర్లు ఉంటేనే సర్వే చేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. తమకు ఇచ్చిన పేర్ల ఆధారంగా ఆ చిరునామాలకు వెళ్లి సర్వే చేస్తున్నామని, జాబితాలో లేని పేర్ల గురించి తమకు తెలియదంటున్నారు.

దరఖాస్తులేమయ్యాయి

ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన చాలా దరఖాస్తులు సర్వే జాబితాలో కనిపించకుండా పోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దాదాపు అన్ని డివిజన్‌లలోనూ ఈ సమస్య నెలకొంది. తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డులతో పాటు అన్ని వివరాలు ఇచ్చామని, ఇతర పథకాలు వర్తించినప్పుడు ఇందిరమ్మ ఇంటి దరఖాస్తు మాత్రం ఎటుపోతుందని బాధితులు ప్రశ్నిస్తున్నారు. సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేరుతుందని ఎదురుచూస్తున్న సమయంలో తమ దరఖాస్తులే లేకుండా పోవడం పట్ల బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సర్వే జాబితాలో దరఖాస్తులన్నీ వచ్చేలా చూడాలని వారు కోరుతున్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో చేపట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కట్టరాంపూర్, వినాయకనగర్, గిద్దెపెరుమాండ్ల స్వామి ఆలయం, గౌతమ్‌నగర్, హనుమాన్‌నగర్, ప్రొఫెసర్‌నగర్, తిరుమల్‌నగర్, అల్కాపురి కాలనీ, కోతిరాంపూర్, మెయిన్‌రోడ్, ఉజ్వల పార్కు, గణేశ్‌నగర్ బైపాస్ ప్రాంతాలు, ఉ.10 నుంచి మ.1గంట వరకు 11కేవీ ఐబీ ఫీడ ర్ పరిధిలోని ఐబీ చౌరస్తా, మానేరు హోటల్ ప్రాంతాలతో పాటు మ.2 నుంచి సా.4 గంటల వరకు 11కేవీ భగత్‌నగర్, రాంచంద్రాపూర్ కాలనీ ఫీడర్ పరిధి లోని వెంకటాద్రికాలనీ, రాంచంద్రాపూర్ కాలనీ, సాయిబాబా ఆలయం, అంజనాద్రికాలనీ, లేక్ పోలీస్‌స్టేషన్, ఎర్రగుట్ట, బైపాస్‌రోడ్, వెంకటేశ్వరకాలనీ, విఘ్నేశ్వర కాలనీ, వాసుదేవ నగ్, ఎన్‌జీవోస్ కాలనీ, కట్టరాంపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.లావణ్య తెలిపారు. అదేవిధంగా ఉ.10 నుంచి 11.30 గంటల వరకు 33/11 కేవీ వావిలాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా టౌన్-3 సెక్షన్ పరిధిలోని వావిలా లపల్లి, ఇందిరానగర్, రామాలయం, సవరన్‌స్ట్రీట్, డీపజీ బంగ్లా, తేజ స్కూల్, కోర్టు వెనుక భాగం, జ్యోతినగర్, ఐబీ, క్రిస్టియన్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ పి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

కబ్జా నుంచి రోడ్డును కాపాడండి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆటోనగర్ వాసులు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ఆటోనగర్‌లో కబ్జాకు గురవుతున్న రోడ్డును కాపాడాలని కోరుతూ కోతిరాంపూర్, ఆటోనగర్ కాలనీ వాసులు శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. 9వ డివిజన్ పరిధిలోని ఆటోనగర్‌లో రోడ్డు కబ్జాకు గురవుతుందంటూ 'ఆ డివిజన్‌లో రోడ్లు మాయం' శీర్షికన ఈనెల 13న 'సాక్షి' కథనం ప్రచురితమైన క్రమంలో కోతిరాంపూర్, ఆటోనగర్‌కాలనీ వాసులు మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య ఆధ్వర్యంలో కమిషనర్, ఏసీపీ వేణులకు ఫిర్యాదు చేశారు. 40 ఏళ్లుగా ఉన్న ఈ రోడ్డును ఆక్రమించేందుకు భవన వ్యర్థాలను పోశారని, ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం నగరపాలక సంస్థకు దరఖాస్తు చేశారని కమిషనర్‌కు వివరించారు. పక్కనే ఉన్న స్థల యజమానుల రిజిస్ట్రేషన్ పేపర్లు చూసినా ఈ రోడ్డు ఉన్నట్లు తెలుస్తుందని అన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి, కబ్జా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య, ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు ప్రకాశ్, ఉమేశ్, మహేందర్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	04	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	02	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	03	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	02	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	08	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	14	560
నందీశ్వర సూట్స్	03	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	16	448
పార్వతీపురం స్పెషల్	20	672
పార్వతీపురం సాధారణ	18	336

- వేములవాడ

ఆత్మీయ భరోసా సర్వే ప్రారంభం

- గోపాల్‌పూర్, మొగ్దుంపూర్‌లో డీఆర్‌డీవో తనిఖీ


ఉపాధికూలీల వివరాలు అడుగుతున్న డీఆర్‌డీవో

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలో శుక్రవారం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం సర్వేను అధికారులు చేపట్టారు. ఆయా గ్రామాల్లో అర్హులుగా గుర్తించిన 1,155 మంది కూలీలకు సంబంధించిన బ్యాంకు ఖాతాపుస్తకం, సెల్‌ఫోన్ నంబర్లను ఉపాధిహామీ సిబ్బంది సేకరించారు. గోపాల్‌పూర్, మొగ్దుంపూర్ గ్రామాల్లో డీఆర్‌డీవో శ్రీధర్ పర్యటించి కూలీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. డీఆర్‌డీవో వెంట ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఏపీవో శోభరాణి, పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, శ్రావణి తదితరులున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఆత్మీయ భరోసాకు సంబంధించిన లబ్ధిదారుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అదే విధంగా రైతు భరోసా పథకంలో భాగంగా ఇరుకుల్లలో ఏఈవో స్వర్ణలత, ఆర్ఐ వాస్తవిక్, ఎలబోతారంలో ఏఈవో సుచరిత, ఏఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మకల్‌లో ఏఈవో పైడితల్లి, సర్వేయర్ సంతోశ్ తదితరులు వ్యవసాయేతర భూముల సర్వే నిర్వహించారు. ఇరుకుల్ల, ఎలబోతారంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీవో సంజీవరావులు సర్వేను పరిశీలించారు.

25 నుంచి బ్రహ్మోత్సవాలు

గన్నేరువరం: ఈనెల 25, 26ల్లో శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వరాల పర్శరాములు తెలిపారు. శుక్రవారం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆలయ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. 25న ఒగ్గుడోలు నృత్యాలతో స్వామివారి పల్లకి సేవ, 26న మల్లన్న పెద్ద పట్నాలు, కల్యాణం, జాతర ఉంటుందన్నారు.

వీరభద్రస్వామి కల్యాణం

శంకరపట్నం: మొలంగూర్ గ్రామంలో వీరభద్ర స్వామి కల్యాణం ఆలయ పూజారి గంగాధర్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు హాజరయ్యారు.

'రవిశంకర్ ఇంటిపై దాడి సరికాదు'

కరీంనగర్: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై కాంగ్రెస్ నాయకుల దాడి సరికాదని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఒక ప్రకటనలో ఖండించారు. దాడికి పాల్పడ్డ నాయకులు, కార్యకర్తలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దాడులు మళ్లీ పునరావృతమైతే తిరిగి ఎదురుదాడులు తప్పవని హెచ్చరించారు.

అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

కరీంనగర్ కార్పొరేషన్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మానుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజీమ్ మొహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ నిమిషం ప్రజా సేవలో నిమగ్నమయ్యే సత్యంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలిసిన నరేందర్‌రెడ్డి


ఆది శ్రీనివాస్‌తో నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి శుక్రవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలను కలిశారు. తన అభ్యర్థిత్వానికి సహకరించాలని కోరారు.

28వ డివిజన్ బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన బూత్ కమిటీ బాధ్యులతో నాయకులు

కరీంనగర్‌టౌన్: బీజేపీ ఈస్ట్ జోన్ పరిధిలోని 28వ డివిజన్ బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. అశోక్‌నగర్ శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు గొట్టిముక్కుల వెంకటరమణ, ఉప్పునీటి సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోలింగ్ బూత్ నియామక ప్రక్రియలో 224 పోలింగ్ బూత్ అధ్యక్షుడిగా జింక శ్యాంసుందర్, 225 బూత్ అధ్యక్షుడిగా తూ ముల ప్రదీప్, 226 బూత్ అధ్యక్షుడిగా కందుకూరి శ్రీవాత్సవ, 227 అధ్యక్షుడిగా కట్ట రాజేశ్, 228 అధ్యక్షుడిగా మనోహర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూత్ కమిటీ ఎన్నికల పరిశీలకులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శేటి సంపత్, శ్రీనివాస్, డివిజన్ కార్యకర్తలు పాల్గొన్నారు.



కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 58వ డివిజన్ జ్యోతినగర్‌లో కొత్తగా డ్రైనేజీ నిర్మిస్తామని చెప్పి, ఇళ్ల ఎదుట రోడ్డు తవ్వేశారు. ఏడాదిన్నర దాటినా ఆ డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం లేదు. తీసిన గుంతలు పూడ్చలేదు. దీంతో ఇండ్లల్లోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందవుతోంది. చిన్న తడకలు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నాం. ఎప్పుడు పడిపోతాయోనని భయంతో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మోర్ సూపర్‌మార్కెట్ సమీపంలో ఇంటి నం.2-10-953 ఎదుట పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. అధికారులు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి. అప్పటివరకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి.

– భారతి, జ్యోతినగర్, కరీంనగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వెంకటేశ్వర్లు, డీఈ, 89199 23123

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకించాలి


మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

కరీంనగర్: దేశంలో జాతీయ నూతన విద్యా విధానం రద్దుకై విద్యార్థులు ఉద్యమించి వ్యతిరేకించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానం 2020 పేరుతో విద్యను పూర్తిగా తమ ఆధిపత్యంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలు ఊసెత్తడం లేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో యూనివర్సిటీల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై చర్చించేందుకు ఫిబ్రవరి 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్ రెడ్డి, శ్రీకాంత్, శ్రావణ్, రాజేశ్ దితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి


ఎంఐఎం నేతలతో మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

కరీంనగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని శుక్రవారం నగరంలోని దారుస్సలాంలో ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్‌ను మాజీ మేయర్ రవీందర్‌సింగ్ మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం జాయింట్ సెక్రటరీ హాఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, సుల్తానాబాద్ కౌన్సిలర్ గొట్టం మహేశ్, కోమటిరెడ్డి తేజ్ దీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వాడకందారులకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న కీర్తి

కరీంనగర్: ఇండేన్ డీలర్లు తమ గ్యాస్ వాడకందారులకు మెరుగైన సేవలు అందించాలని ఇండియన్ కార్పొరేషన్ తెలంగాణ, ఆంధ్ర విక్రయ విభాగం(ఐఓసీఎల్)సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ అధికారి కె.కీర్తి అన్నారు. నగరంలోని కేఎస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కరీంనగర్ సేల్స్ ఏరియా-1 ఇండేన్ గ్యాస్ డీలర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న కాలంలో వంటగ్యాస్ వ్యాపారాన్ని ప్రైవేట్ సంస్థలు చేపట్టే అవకాశాలున్నాయని, వారికి దీటుగా సేవలందిస్తే మనం కస్టమర్లను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ ఎల్‌పీజీ డీలర్, అంబుజా గ్యాస్ ఏజెన్సీ అధినేత పీవీ. మదన్‌మోహన్, సీనియర్ డీలర్లు సుభాష్‌రావు, రాధాకృష్ణ, ప్రవీణ్, శ్రీధర్, గట్టు రాజయ్య, అమరీష్, రాము, హన్మంత్, వెంగళరావు, అజయ్, వెంకటేశ్వరరావు, నరేందర్, రాజ్‌కుమార్, మోహిత్, మీరాబాయ్, గీత తదితరులు పాల్గొన్నారు.

దారి కోసం రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్లలో శుక్రవారం నృసింహస్వామి ఆలయంతో పాటు పొలాలకు వెళ్లే దారిని కబ్జా చేశారని ఆరోపిస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ గ్రామశివారులోని గుట్ట వద్ద గతంలో కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి క్రషర్ నిర్వహించి మూసివేశాడని అన్నారు. ఆ క్రషర్ భూమి నుంచి ఇటీవల మట్టిని తరలించగా గుట్ట నుంచి అక్రమంగా మట్టి తీస్తున్నాడని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి పనులు నిలిపివేయించారని తెలిపారు. అయితే మూడు రోజుల క్రితం రాత్రికిరాత్రే గుట్ట సమీపం నుంచి నృసింహస్వామి ఆలయం, ఊర చెరువు, పొలాలకు వెళ్లే దారికి అడ్డుగా జేసీబీతో కందకాలు కొట్టించడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో రైతులందరం కలిసి క్రషర్ స్థలం వద్ద దారి కోసం ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. క్రషర్ నిర్వాహకుడికి సర్వే నం.314/బి/2లో కేవలం 36గుంటల పట్టా మాత్రమే ఉండగా సమీపంలోని సర్వేనం.314/బీ/1లోని 3 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి రైతులకు దారి లేకుండా చేశారని ఆరోపించారు. గ్రామస్తులందరికీ ఉపయోగపడే దారిని ఆక్రమణ నుంచి కాపాడేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు జువ్వాడి వెంకట నర్సింగరావు, చింతల రవీందర్‌రెడ్డి, మహ్మద్ రఫీ, జువ్వాడి రామరావు, ఏగుర్ల శంకర్, వెంకటయ్య,పుల్ల రాజయ్య, బోయిని మల్లయ్య, ఐలవేని రవి, సర్వర్, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.